క్లుప్తంగా

రత్నగిరిపై సూర్యనమస్కారాలు



సూర్యనమస్కారాలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని కళావేదిక మీద ఆదివారం సూర్యనమస్కారాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు పండితులు రాపాక రాందాసు, చిట్టిం సాయి, ప్రవీణ్, జోస్యుల శేషు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ భంగిమల్లో సూర్యనమస్కారాలు నిర్వహించారు. ఉదయం 11.30 గంటల వరకు ఈ పూజలు కొనసాగాయి. అనంతరం సూర్యభగవానుడికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కొండరాజులబాబు పండగ



రమణయ్యపేటలో కొండరాజులబాబు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుకాణాలు

ఏలేశ్వరం: మండలంలోని రమణయ్యపేటలో కొండరాజులబాబు పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు సమీప పొలాల్లో వేడుకలు చేసుకున్నారు. ఆలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని పలు చోట్ల వివిధ గ్రామాల చెందిన భక్తులు పండగలు చేసుకున్నారు. మొక్కులు చెల్లించుకుని విందు భోజనాలు చేశారు.

మల్లేపల్లిలో అన్నసమారాధన

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. కాగా నాలుగు రోజుల పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామి, అమ్మవార్లకు ఊరేగింపు నిర్వహించినట్టు ఆలయ కమిటీ పేర్కొంది. చివరి రోజు ఆదివారం సాయంత్రం శ్రీపుష్పయాగం (పవళింపు సేవ) నిర్వహించారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

గోకవరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సునీల్ ఆదివారం తెలిపారు. మండలంలో 14,658 మందికి ఈ మాత్రల పంపిణీ చేయడం లక్ష్యమన్నారు. సోమవారం తొలి విడతగా, 17న రెండో విడతగా మాత్రలు మింగిస్తామని చెప్పారు. విద్యార్థులు ఈ మాత్రలు వేసుకునే విధంగా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:

తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540
కిర్లంపూడి:	
తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	- 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	- 89789 41840
హౌసింగ్ ఏఈ	- 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	- 97014 77778

అడుగంటినది..!

- ఎండిపోతున్న పంపా రిజర్వాయర్
- ప్రస్తుతం 87 అడుగుల వద్ద నీటిమట్టం
- బ్యారేజీకి కొత్త గేట్ల ఏర్పాటు పనుల కోసం దిగువకు నీటి విడుదల
- నాలుగేళ్లలో ఎన్నడూ లేనివిధంగా కనిష్ట స్థాయికి నీటి నిల్వలు



అడుగంటిన పంపా రిజర్వాయర్

అన్నవరం: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి జలాలను సరఫరా చేసే పంపా రిజర్వాయర్‌లో నీరు అడుగంటింది. 103 అడుగుల గరిష్ట నీటి మట్టం కలిగిన పంపా రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటి మట్టం 87 అడుగులకు చేరుకుంది. రిజర్వాయర్‌లో మధ్యలో మినహా చుట్టూ నీరు అడుగంటడంతో మట్టి దిబ్బలు బయటపడుతున్నాయి. వేసవి కాలం ప్రారంభం కావడంతో ఎండ తీవ్రతకు రిజర్వాయర్‌లో ఉన్న నీరు కూడా ఆవిరయ్యే అవకాశం ఉంది. వచ్చే ఏప్రిల్‌లో శ్రీరామ నవమి వేడుకలు, మే నెలలో సత్యదేవుని కల్యాణ మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ వేడుకలకు వేలసంఖ్యలో భక్తులు రత్నగిరికి రానున్నారు. అదే సమయంలో పంపాలో నీరు మరింతగా అడుగంటే అవకాశం ఉంది. ఫలితంగా ఈ ఏడాది దేవస్థానానికి నీటి ఎద్దడి తప్పేలా లేదు.



కొత్త గేట్లు ఏర్పాటు చేయనున్న పంపా బ్యారేజీ

12,500 ఎకరాల ఆయకట్టు


తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో 12,500 ఎకరాలకు సాగునీరు, చెరువులకు తాగు నీటిని సరఫరా చేసే పంపా రిజర్వాయర్ పూర్తిగా ఎండిపోయింది. 103 అడుగుల గరిష్ట నీటిమట్టం కలిగిన పంపా రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో 0.43 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. ప్రస్తుత నీటి మట్టం 87 అడుగులు మాత్రమే ఉండడంతో కేవలం 0.049 టీఎంసీ నీరు మాత్రమే నిల్వ ఉంది. మరో మూడు అడుగులు నీటి మట్టం తగ్గితే రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరుకుంటుంది. పంపా రిజర్వాయర్‌లో నీటి మట్టం పుష్కలంగా ఉంటేనే నదీ గర్భంలో ఉన్న బోర్లు ద్వారా అన్నవరం దేవస్థానం అవసరాలకు సరిపడా నీరు సరఫరా అవుతుంది. రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉంటే ఆ బోర్లు కూడా వట్టిపోయి నీటి సరఫరా ఆగిపోతుంది. కాగా ఏప్రిల్‌లో జరిగే శ్రీరామనవమి వేడుకలు, మే నెలలో జరిగే సత్యదేవుని కల్యాణ మహోత్సవాల్లో భక్తులకు తాగినీటి ఇబ్బంది తప్పేలా లేదు.

వర్షాలు కురిసినా..

గతేడాది వర్షాలు పుష్కలంగా కురిశాయి. గత డిసెంబర్ నాటికి రిజర్వాయర్‌లో 98 అడుగుల నీరు నిల్వ ఉంది. కాగా పంపా బ్యారేజీకి కొత్త గేట్లు అమర్చేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.3.36 కోట్లు నిధులు విడుదల చేసింది. బ్యారేజీకి నూతన గేట్లు అమర్చాలంటే గేట్లు వద్ద నీరు ఉండకూడదు. అందుకోసం గత రెండు నెలలుగా రిజర్వాయర్ నీటిని దిగువకు వదిలేశారు. దీంతో రిజర్వాయర్ నీటి మట్టం 87 అడుగులకు పడిపోయింది. రిజర్వాయర్ దాదాపుగా డెడ్ స్టోరేజీ లెవిల్‌కు వచ్చేసింది. కొత్త గేట్లు ఏర్పాటు చేయాలనే కారణంతో ఈ ఏడాది పంపా ఆయకట్టులో రబీ సాగుకు కూడా అనుమతి ఇవ్వలేదు. వ్యవసాయ బోర్లు ఉన్నవారు మాత్రమే ఈ ఏడాది రబీసాగు చేశారు.



పంపా కాలువ నుంచి దిగువకు వదిలేస్తున్న నీరు



87 అడుగులకు చేరిన నీటి మట్టం

సత్యదేవుని ఉత్సవాలకు నీటి కష్టాలు తప్పవా ?

రత్నగిరిపై ఏటా వేసవిలో శ్రీరామ నవమి వేడుకలు, సత్యదేవుని కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల చివరి రోజుకు ముందు పంపా నదిలో శ్రీచక్రస్నానం నిర్వహిస్తారు. కాగా ఈ ఏడాది ఆయా కార్యక్రమాలకు నదిలో అవసరమైనంత నీరు ఉండే అవకాశం లేదు. ఇటువంటి పరిస్థితి ఏటా ఉత్పన్నం అవుతున్నా అన్నవరం దేవస్థానం అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోకుండా అప్పటికప్పుడు తాత్కాలిక ఏర్పాట్లు చేసి మమ అనిపించేస్తున్నారు. కొండ దిగువన పంపా తీరంలో చిన్న కోనేరు నిర్మించి అందులో శ్రీరాముని, శ్రీసత్యదేవుని చక్రస్నానాలు నిర్వహిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కొత్త గేట్లు ఏర్పాటు చేస్తాం



పంపా బ్యారేజీకి రూ.3.36 కోట్లతో కొత్త గేట్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు గాను త్వరలో టెండర్లు ఖరారు చేస్తాం. కొత్త గేట్లు ఏర్పాటు చేయడానికి బ్యారేజీ గేట్లు వద్ద నీరు ఉండకూడదు. అందుకోసం నీటిని దిగువకు వదిలేయాల్సి వచ్చింది. ప్రస్తుతం 87 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది. త్వరలో గేట్లు ఏర్పాటు పనులు ప్రారంభించి నెల రోజుల్లో పూర్తి చేస్తాం.

జి.శేషగిరిరావు, ఇరిగేషన్ ఈఈ, పెద్దాపురం డివిజన్

వెట్టి చాకిరీ నిర్మూలనకు కృషి చేయాలి

ప్రత్తిపాడు: సమాజంలో వెట్టి చాకిరీ బానిసత్వానికి చిహ్నమని, దీని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్యానెల్ అడ్వకేట్, ఐలాజ్ జాతీయ కమిటీ సహాయ కార్యదర్శి బుగత శివ కోరారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పెదశంకర్లపూడి పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం వెట్టి చాకిరి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బుగత శివ మాట్లాడుతూ నాగరిక సమాజంలో వెట్టి చాకిరి చేస్తే చట్ట ప్రకారం శిక్షలు ఉంటాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెట్టి చాకిరికి పాల్పడినట్లయితే మండల న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. వెట్టి చాకిరి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సూర్నీడి సురేష్, జువ్విన తిరుపతిరావు, దో నూకరాజు, నాగేశ్వరరావు, కందుల పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న బుగత శివ

మద్యం దుకాణాలకు 50 దరఖాస్తులు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో కల్లు గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాల ఏర్పాటుకు 50 దరఖాస్తులు వచ్చినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ ఆదివారం తెలిపారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు, కిర్లంపూడి, శంఖవరం మండలాలకు ఒక్కొక్కటి వంతున మూడు మద్యం దుకాణాలను కేటాయించారని చెప్పారు.

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా లోవరాజు



ప్రత్తిపాడు: స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా బర్ల లోవరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం ప్రెస్ క్లబ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీకంగా ఎన్నుకున్నారు. గళ్ల కృష్ణమోహన్ ప్రెస్ క్లబ్ కార్యదర్శిగానూ, మరో ఎనిమిది మంది సభ్యులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: వి.కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాలుగో తరగతి చదువుకున్న బాలికలు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 88852 43988, 81425 55728 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పాండవుల తీర్థానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం గ్రామంలో జరుగుతున్న పాండవుల తీర్థానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో చుట్టు పక్కల మండలాలకు చెందిన వేలాది మంది ప్రజలు తీర్థానికి వచ్చారు. గుహల్లో ఉన్న పాండవులు, ద్రౌపదీదేవి, కొండ దిగువ భాగంలో ఉన్న శ్రీకృష్ణుని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తుల రాకతో పాండవుల మెట్టతో పాటు తీర్థం ప్రదేశం కిటకిటలాడింది. చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.



రంపయర్రంపాలెంలో పాండవుల మెట్టకు క్యూ కట్టిన భక్తులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. వాటర్ ట్యాంక్‌ల్లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.



కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

వైభవంగా వెంకన్న గ్రామోత్సవం



తంటికొండలో వేంకటేశ్వరస్వామికి గ్రామోత్సవం

గోకవరం: మండలంలోని తంటికొండలో వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని స్వామివారిని ఉదయం గరుడ వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, ఈఓ వడ్డాది సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామోత్సవం కొనసాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఆర్కెస్ట్రా, తీన్‌మార్, శక్తివేషాలు, మ్యూజికల్ బ్యాండ్, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నేడు విద్యుత్ అంతరాయం

తొండంగి: మండలంలోని అన్నయ్యపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ వీరభద్రరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నయ్యపేట, పైడికొండ, వేమవరం, ఆనూరు, జి.ముసలయ్యపేట, గృహ, చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయ విభాగాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బెల్లపు ఊట ధ్వంసం



పెద్దిపాలెంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది

ప్రత్తిపాడు: మండలంలోని పెద్దిపాలెం గ్రామ శివారులో సారా స్థావరాలపై ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రత్తిపాడులో మేరీమాత యాత్ర మహోత్సవం

ప్రత్తిపాడు: స్థానిక మరియగిరిపై ఈ నెల 11న మేరీమాత యాత్ర మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆర్‌సీఎం చర్చి కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక ఆర్‌సీఎం చర్చిలో పాస్టర్ కె.చిన్నప్ప దివ్యబలి పూజ నిర్వహిస్తారు. మధ్యాహ్నం స్థానిక ఆర్‌సీఎం చర్చి నుంచి మేరీమాత తేరును మరియగిరి వరకూ ఊరేగిస్తారు. మరియగిరిపై పాస్టర్లు దివ్యబలిపూజ నిర్వహిస్తారు. క్రైస్తవ సోదరులు, మతకన్యలు పాల్గొని, మేరీమాత యాత్ర మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.



ప్రత్తిపాడులో మరియగిరిపై మేరీమాత

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచిలో గ్రామ సర్పంచ్ మంతిన శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పిఠాపురం జేఎస్ఎన్ గాయత్రి కంటి ఆసుపత్రి వైద్యులు 100 మందికి వైద్య సేవలు అందించారు. 40 మందికి కళ్ల జోళ్లు అవసరం కాగా, మరో 15 మందికి కంటి శస్త్ర శికిత్స అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తరకంచిలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

అల్లుకున్న నిర్లక్ష్యం

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, భూపాలపట్నం ప్రధాన రహదారులను ఆనుకొని ఉన్న విద్యుత్తు స్తంభాలకు ముళ్లచెట్లు, తీగపాదులు అల్లుకున్నాయి. విద్యుత్ స్తంభానికి ఇరువైపులా ఇలా ఉండటంతో విద్యుత్ వైర్లకు కూడా అల్లుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కిర్లంపూడిలో విద్యుత్ స్తంభాన్ని అల్లుకున్న పాదులు

ప్రభుత్వ పథకాలకు భూ ఆధార్

- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- నెలాఖరులోగా నమోదు చేసుకోవాలని సూచన

గోకవరం: రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే పథకాలు వర్తించేందుకు భూ ఆధార్, ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నూతనంగా తీసుకువచ్చినట్టు మండల వ్యవసాయశాఖ అధికారి జి.రాజరాజేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పథకాలకు అర్హులను గుర్తించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. భూమి ఉన్న రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, 1బి, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ చేసిన మొబైల్ నంబర్ సమర్పించి భూ ఆధార్ పొందాల్సి ఉంటుందన్నారు. మండలంలోని రైతులు సమీప రైతు సేవా కేంద్రంలో సంప్రదించి ఈ నెల 25 నాటికి ఈ భూ ఆధార్ నమోదు చేసుకోవాలని సూచించారు.

తొండంగి: వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా వివిధ పంటల సాగు చేస్తున్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందాలంటే అన్నదాతలు భూ-ఆధార్ నమోదు చేసుకోవాలని ఏఓ ఎస్ నరసింహం సూచించారు. రైతులందరూ ఈ నెల 28లోగా భూ ఆధార్ నమోదు చేసుకోవాలన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల వద్ద ఆదివారం భూ-ఆధార్ నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆధార్ నంబర్ మాదిరిగా భూమి కలిగిన ప్రతి రైతుకూ రైతు విశిష్ట సంఖ్య (14 అంకెల ఐడీ) కేటాయించేందుకు ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. సొంత భూమి కలిగిన రైతులంతా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి 1బి ఫారం, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ వివరాలను వ్యవసాయ శాఖసిబ్బందికి అందిస్తే విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారన్నారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లలేని రైతులు గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్లుకు 1బిఫారం, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ వివరాలు తెలిపితే ఓటీపీ ద్వారా భూ-ఆధార్ నమోదు చేసి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు.



శృంగవృక్షంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నరసింహం

భూ-ఆధార్‌తో కలిగే ప్రయోజనాలు

- రైతులు సాగు చేసిన పంటలకు బీమా వర్తిస్తుంది.
- కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ యోజనలో లబ్ధి చేకూరుతుంది.
- ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోతే పరిహారం పొందవచ్చు
- వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలులో రాయితీ పొందవచ్చు.
- అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుంది.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



ప్రతిభ చూపిన విద్యార్థికి బహుమతి అందిస్తున్న విజయ్‌ప్రకాష్

తుని: జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలోని వివిధ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో ఆదివారం పోటీల్లో రాణించిన క్రీడాకారులకు అభినందన సభ నిర్వహించారు. విద్య, సాంస్కృతిక, క్విజ్, ఆటలు, యోగా, పోటీ పరీక్షల్లో వివిధ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 1050 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. తమ విద్యాసంస్థ విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తోందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.